క్లుప్తంగా

కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎన్టీటీపీఎస్ మెయిన్ గేట్ వద్ద ఎన్టీటీపీఎస్ కార్మిక సంఘాల నాయకులు గురువారం ధర్నా చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ ఎన్నికల హామీల కోసమే కార్మికులను వాడుకోవడం దుర్మార్గమన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కరపత్రాలు పంపిణీ చేశారు.

భూసార పరీక్ష కార్డుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: సంపూర్ణ అభియాన్ కార్యక్రమాలు మండల పరిధిలోని మూలపాడు, కేతనకొండ గ్రామాల్లో గురువారం జరిగాయి. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్ష కార్డులను రైతులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ భూసారాన్ని బట్టి రైతులు ఎరువులు వినియోగించాలని చెప్పారు. ఏఓ శైలజ మాట్లాడుతూ భూమి సారవంతం, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆస్పిరేషనల్ బ్లాక్స్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలో పనిచేస్తున్న కార్మికుల నాలుగు నెలల పెండింగ్ వేతనాలను తక్షణం చెల్లించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ డిమాండ్ చేశారు. కొండపల్లి మున్సిపాల్టీ డంపింగ్ యార్డ్ వద్ద వేతనాల కోసం గురువారం కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చేతికిరాక కరెంటు బిల్లులు, ఇంటి అద్దె కట్టలేక, గ్యాస్, నిత్యావసర సరుకులు కొనలేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. కనీసం అప్పులు కూడా పుట్టక పస్తులు ఉండాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, కలెక్టర్ సృజన జోక్యం చేసుకుని సకాలంలో వేతనాలు విడుదల చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు అప్పారావు, సురేష్, దేవుళ్లు, రమణ, కార్మికులు పాల్గొన్నారు.

పశు వైద్యశాల సందర్శన

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు పశు వైద్యశాలను జిల్లా పశు సంవర్ధక శాఖాధికారులు గురువారం సందర్శించారు. ఆ శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.హనుమంతరావు వైద్యశాలలో పరిస్థితులపై ఆరా తీశారు. ఈ నెల మొదటి వారంలో కృష్ణానదికి వచ్చిన వరదలకు పశు వైద్యశాల ముంపునకు గురైన విషయాన్ని వైద్యులు ఆయనకు వివరించారు. వరద నీటితో వైద్యశాలలో పాడైన రిజిస్టర్లు, మందులు, బీరువాలు, ఫ్రిడ్జి, సెమెన్ కంటైనర్లు తదితర వస్తువులను ఆయన పరిశీలించారు. సమగ్ర నివేదిక తయారుచేసి ఇవ్వాలని వైద్యులను ఆయన ఆదేశించారు. ఉప సంచాలకులు జి.మోజెస్ వెస్లీ, నందిగామ సహాయ సంచాలకులు యూజీ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో స్వచ్ఛతా హీ సేవా

ఎంపీడీఓ జి. రాణి

ముసునూరు: కాలుష్య సమస్యలు తొలగించి, గ్రామాలను పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన శనివారం గ్రామ సభలు నిర్వహించి, గ్రామస్తులను పరిసరాల పరిశుభ్రత దిశగా చైతన్యపర్చాలని సూచించారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం చేపట్టే అన్ని కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాస్, కార్యాలయ ఏఓ సాయిరాము, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల సిబ్బందికి వైద్య పరీక్షలు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఆంధ్రా హాస్పిటల్ సౌజన్యంతో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సిబ్బందికి బీపీ, షుగరు, కిడ్నీ, హార్ట్, కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, ఆంధ్రా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఎ. అచ్యుతబాబు, దుహిత దంత వైద్యశాల డాక్టర్ ఎన్. శశిధర్, అమరావతి సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి డాక్టర్ ఎన్. వేణు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

థియేటర్లు తనిఖీ చేసిన తహసీల్దార్

ఇబ్రహీంపట్నం: దేవర సినిమాకు ప్రభుత్వం నిర్ణయించిన టిక్కెట్ ధరల కంటే అధికంగా బ్లాక్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు స్థానిక బాలాజీ, స్వర్ణ థియేటర్లను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్ధరాత్రి ఒంటి గంట షోకు టిక్కెట్లు రూ.800, బెనిఫిట్ షో రూ.450 చొప్పున బ్లాక్‌లో విక్రయించారనే ఆరోపణలపై థియేటర్ యాజమాన్యాలను వివరణ కోరారు. బాలాజీ థియేటర్‌లోని హోటల్‌లో గృహ వినియోగం గ్యాస్ సిలిండర్ల వాడకంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డొమెస్టిక్ సిలిండర్ల వినియోగంపై పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ఉండలేం.. వెళ్లలేం

- గొడుగువారిగూడెంలోకి ట్రిపుల్ ఐటీ మురుగునీరు
- దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు
- దోమల విజృంభణ
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు



నిల్వ ఉన్న ట్రిపుల్ ఐటీ మురుగునీరు

నూజివీడు: పట్టణ పరిధిలోని ట్రిపుల్ ఐటీ వ్యర్థ జలాలను పక్కనే ఉన్న గొడుగువారిగూడెం గ్రామంలోకి వదిలి వేస్తున్నారు. మురుగునీరు తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. మురుగుతో దోమలు పెరిగి స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. మురుగు తొలగించాలని స్థానికులు ట్రిపుల్ ఐటీ ఉన్నతాధికారులను ఎన్నిసార్లు కోరినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనకు భోజనం కూడా సరిగా చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇళ్లల్లో ఉండలేకపోతున్నామని, వేరే చోటికి వెళ్లే పరిస్థితి లేదని వాపోతున్నారు.

ట్యాంకర్లతో తరలించాలి

నూజివీడు ట్రిపుల్ ఐటీలో 8,600 మంది విద్యార్థులు వాడిన నీటితో పాటు మెస్‌లకు ఉపయోగించే నీరు, క్వార్టర్లలో ఉండే ఉద్యోగుల కుటుంబాలు 10 వేల మంది ఉపయోగించిన నీరు ట్రిపుల్ ఐటీలోనే ఉన్న సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)కి చేరుతుంది. అక్కడ శుద్ధి చేసిన తరువాత వ్యర్థ జలాలను ట్రిపుల్ ఐటీ ఆవరణలోనే ఉన్న చిన్న చెరువులోకి వదులుతారు. అక్కడి నుంచి కాంట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా బయటకు తరలించాలి. దీనికి గాను కాంట్రాక్టర్‌కు వెయ్యి లీటర్లకు రూ.33 చొప్పున ట్రిపుల్ ఐటీ చెల్లిస్తుంది. రోజుకు 11 లక్షల లీటర్ల వ్యర్థ జలాలను బయటకు తరలించాల్సి ఉంది. ఆ విధంగా తరలించకుండా ఎస్టీపీ నుంచి చెరువులోకి వెళ్లే కాలువ నుంచి మురుగునీటిని రాత్రి పూట గొడుగువారిగూడెం వైపునకు వదిలి వేస్తున్నారు. వర్షాలు కురిసేటప్పుడు, ముసురు వాతావరణం ఉన్నప్పుడు నిత్యం వదులుతున్నారు. మురుగు నీటి కారణంగా దోమలు, ఈగల బాధ సంవత్సరం అంతా ఉంటోంది. దీంతో అద్దెకు ఉన్న వారు సైతం ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. సొంత ఇంటి వారు ఇక్కడ ఉండలేక, వేరే ప్రాంతానికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.



దద్దుర్లు వచ్చి పుండ్లు పడుతున్నాయి

ట్రిపుల్ ఐటీ మురుగు నీరు కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. దుర్వాసనతో రాత్రి పూట నిద్ర పోవడం లేదు. దోమలు కుట్టి చిన్నపిల్లలకు దద్దుర్లు వచ్చి పుండ్లు పడుతున్నాయి. జ్వరాలు వస్తున్నాయి. మురుగునీరు రాకుండా చూడాలి. – పాదం నాగమణి, గొడుగువారిగూడెం



అన్నం తినలేకపోతున్నాం

మురుగునీటి వల్ల బోర్లలో నీరు దుర్వాసన వస్తోంది. చీకటి పడితే దుర్వాసన మరింత పెరుగుతోంది. అన్నం కూడా తినలేకపోతున్నాం. మురుగునీటి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి.
– పసుపులేటి శిరీష, గొడుగువారిగూడెం

వారంలో చర్యలు తీసుకుంటాం

మురుగు నీరు రాకుండా వారంలోగా చర్యలు తీసుకుంటాం. క్యాంపస్‌లోని వర్షం నీరంతా అటువైపే వెళ్తుండటం, గోడ పడి పోవడంతో మురుగునీరు వెళ్తోంది. గ్రామంలోని డ్రెయినేజీల్లో సైతం బ్లీచింగ్ చల్లించాం.
– భార్గవ్,ట్రిపుల్ ఐటీ ఏఈ

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు

నూజివీడు: బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ ఆర్. వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని డీఏఆర్ కళాశాలలో గురువారం బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే వివాహం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. మీ చుట్టుపక్కల ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే 1098 నంబరుకు కానీ, సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు కానీ, అంగన్‌వాడీ సిబ్బందికి కానీ సమాచారం ఇవ్వాలని కోరారు. నూజివీడు పట్టణాన్ని బాల్య వివాహ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎన్‌సీసీ ఏఎన్ఓ పి. మనోహర్ బాల్య వివాహ నిరోధంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. కిరణ్‌కుమార్, కె. కృష్ణవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ విన్నర్స్ జి.కొండూరు జట్టు

మైలవరం: నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో కబడ్డీ విన్నర్స్‌గా జి.కొండూరు జట్టు నిలిచింది. జి.కొండూరు జట్టు మైలవరం జట్టుపై గెలుపొందింది. మైలవరంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. గురువారం అండర్ 14, అండర్ 17 బాలుర పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొనగా 26 మంది వ్యాయామోపాధ్యాయులు పోటీలు నిర్వహించారు. అండర్– 17 కబడ్డీలో మైలవరం జట్టుపై జి.కొండూరు విజయం సాధించి విజేతగా నిలిచింది. వాలీబాల్‌లో రెడ్డిగూడెం జట్టు విన్నర్‌గా, జి. కొండూరు జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఖోఖోలో మైలవరం జట్టు విన్నర్ కాగా ఇబ్రహీంపట్నం జట్టు రన్నర్, షటిల్ బ్యాడ్మింటన్‌లో మైలవరం విన్నర్, విజయవాడ రూరల్ రన్నర్, చెస్‌లో విజయవాడ రూరల్ విన్నర్, జి.కొండూరు జట్టు రన్నర్‌గా నిలిచింది. అండర్–14 విభాగంలో కబడ్డీ జి.కొండూరు విన్నర్ కాగా ఇబ్రహీంపట్నం రన్నర్ వాలీబాల్‌లో రెడ్డిగూడెం విన్నర్ కాగా ఇబ్రహీంపట్నం రన్నర్, ఖోఖోలో మైలవరం విన్నర్ కాగా ఇబ్రహీంపట్నం రన్నర్, షటిల్‌లో మైలవరం విన్నర్, విజయవాడ రూరల్ రన్నర్, చెస్‌లో ఇబ్రహీంపట్నం విన్నర్, విజయవాడ రూరల్ రన్నర్, యోగాలో ఇబ్రహీంపట్నం విన్నర్ కాగా మైలవరం రన్నర్స్‌గా నిలిచాయి. అండర్–14, అండర్ 17 బాలికల ఆటల పోటీలు వాయిదా పడ్డాయని నిర్వాహకులు, వ్యాయామోపాధ్యాయులు ఎం. రవికుమార్ తెలిపారు.

చిట్యాల ఐలమ్మ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

మైలవరం: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం, దొరల దోపిడీ, రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) సేవలు చిరస్మరణీయమని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బుద్దవరపు వెంకట్రావు అన్నారు. మైలవరం పంచాయతీ అతిథి గృహంలో చిట్యాల ఐలమ్మ జయంతి కార్యక్రమం మైలవరం నియోజకవర్గ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దోపిడీకి వ్యతిరేకంగా ఐలమ్మ వీరోచితంగా పోరాడారని వివరించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని ఆటో స్టాండ్‌లో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మైలవరం నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షులు తాళ్లూరి శేషగిరిరావు, మైలవరం రజక సంఘం అధ్యక్షులు మల్లెల రాధాకృష్ణ, వార్డు సభ్యుడు మల్లెల దుర్గారావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు కవులూరు హైస్కూల్ విద్యార్థులు

జి.కొండూరు: మైలవరంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో కవులూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నలుగురు ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం నాగేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎన్. కోమల్‌దీప్, షటిల్ బ్యాడ్మింటన్‌లో బి. కుమార్, అండర్–17 విభాగంలో కబడ్డీ పోటీలకు కె. రామసోమేశ్వరరావు, వాలీబాల్ పోటీలకు జి. మహేంద్ర ఎంపికయ్యారని చెప్పారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, పీడీ శ్రీలతను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆగిరిపల్లి: మండలంలోని ఈదులగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నూజివీడులోని ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన డివిజన్ స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడి ప్రసాద్, పీడీ నాగేశ్వరరావు అభినందించారు.

తిరువూరు ఎమ్మెల్యే వైఖరి గర్హనీయం : ఏపీడబ్ల్యూజేఎఫ్

తిరువూరు: విలేకరుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వెంటనే క్షమాపణ చెప్పాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఆంజనేయులు డిమాండ్ చేశారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన ఫెడరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వైఖరిపై తెలుగుదేశం పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ నెల 28 నుంచి ఆందోళనా కార్యక్రమాలు చేపడుతున్నామని, తిరువూరు పోలీసుస్టేషన్‌లో పాత్రికేయులు ఎమ్మెల్యేపై చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోని విషయంపై కూడా విజయవాడ పోలీస్ కమిషనర్‌ను కలుస్తామన్నారు. ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నూజివీడు: పట్టణ పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి గురువారం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశంలో కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరు కావాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

మైలవరం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య సూత్రాలు పాటించాలని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రంగారావు అన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న 148 మంది విద్యార్థులకు చంద్రాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేజర్ మన్నే స్వామి. కళాశాల సిబ్బంది, పాల్గొన్నారు.

29న ఎస్పీ బాలు స్వరార్చన

నూజివీడు: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకొని ఈనెల 29న నూజివీడు కళావేదిక, శ్రీ సత్య నృత్య సంగీత అకాడమీ, రాగసుధ మెలోడీస్ సంయుక్త ఆధ్వర్యంలో నూజివీడులో ఎస్పీ బాలు స్వరార్చన కార్యక్రమం ఏర్పాటు చేశామని నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాల ఆవరణలో సాయంత్రం 4.30 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో ఔత్సాహిక గాయనీ గాయకులు పాల్గొని ఎస్పీ బాలు పాడిన మధుర గీతాలను ఆలపిస్తారన్నారు.

ప్రణాళికలు రూపొందించాలి

చాట్రాయి: గ్రామాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలని మండల ప్రత్యేకాధికారి రమణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో వికసిత భారత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2047కి అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలని, పేదరికం నిర్మూలన జరగడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

ఆగిరిపల్లి: మండలంలోని సీతారాంపురంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.17,700 నగదును, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును అరెస్టు చేయాలి

మైలవరం: అంబేడ్కర్ ఫ్లెక్సీని చించి దళితుల మనోభావాలను దెబ్బతీసిన ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణంరాజును వెంటనే అరెస్టు చేయాలని దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, జై భీమ్ సంఘ సభ్యుడు బుర్రి ప్రతాప్ డిమాండ్ చేశారు. రఘురామ కృష్ణంరాజును బర్తరఫ్ చేసి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశామన్నారు. దళిత జేఏసీ జిల్లా అధ్యక్షురాలు స్వప్న పాల్గొన్నారు.

పశువుల కాపరిపై దాడి

ఆగిరిపల్లి: వడ్లమానుకు చెందిన మేకల కాపరి నక్క సుబ్రహ్మణ్యం కొత్త ఈదరలో మేకలను మేపుతుండగా గ్రామానికి చెందిన కొందరు తమ తోటలోని మామిడి మొక్కలు నరుకుతావా అని అతనిపై దాడి చేసి మేకలను బంధించారు. బాధితుడిని నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

రేపు నూజివీడు నియోజకవర్గ అథ్లెటిక్స్ పోటీలు

నూజివీడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న పట్టణంలోని డీఏఆర్ కళాశాల ఆవరణలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని పోటీల నిర్వహణ ఇన్‌చార్జి రవీంద్ర గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి మండలాలకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. అండర్ 14 , అండర్ 17 విభాగాల్లో బాల బాలికలకు రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, ట్రిపుల్ జంప్, హ్యామర్ త్రోలలో సెలక్షన్స్ జరుగుతాయని చెప్పారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం ఏర్పాట్లు చేశామన్నారు. క్రీడాకారులు జూనియర్ విభాగంలో 2011 జనవరి ఒకటి తరువాత, సీనియర్ విభాగంలో 2008 జనవరి ఒకటి తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు.

కిసాన్ కార్డులు అందజేత

నూజివీడు: మండలంలోని బోర్వంచ శివారు కొన్నంగుంటలో కిసాన్ సభ ప్రాజెక్టు మండల కో–ఆర్డినేటర్ ఎం. భూలక్ష్మి రైతులకు గురువారం కిసాన్ కార్డులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా కిసాన్ కార్డులను తీసుకోవాలన్నారు. పంటల నష్టపరిహారం రైతులకు అందాలంటే ప్రతి రైతు పంటల బీమా నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ముసునూరు మండల కో–ఆర్డినేటర్ పి. రజని, రైతులు పాల్గొన్నారు.

● ఆత్మీయ కలయిక



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ఇతర పరిణామాలపై మాట్లాడారు.
–మైలవరం

పంట కుళ్లిపోయినా నమోదు చేయడం లేదు



కొత్తగూడెంలో నీటిలో మునిగి కుళ్లిపోయిన పెసర పంట

మైలవరం: ఇటీవల కురిసిన వర్షాలకు వరద ముంపునకు గురై పెసర, మినుము పంటలు పూర్తిగా కుళ్లిపోయి నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టం అంచనాలు నమోదు చేసేందుకు వచ్చిన వ్యవసాయ శాఖాధికారులు నష్టపోయిన పంట పొలాల ఎన్యూమరేషన్‌లో నమోదు చేయలేదని మైలవరం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన రైతు వజ్రాల నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో 200 ఎకరాలకు పైగా రైతులు పెసర పంట వేశారని, పెసరతో పాటు మినుము కూడా పూర్తిగా నీట మునగడంతో పంటలు పూర్తిగా కుళ్లిపోయాయని చెప్పారు. అధికారులు ఎన్యూమరేషన్ కింద ఒక్క ఎకరం కూడా రాయలేదన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదన్నారు. కొంత మంది అధికార పార్టీ నాయకుల ఒత్తిడి వల్ల కొత్తగూడెం గ్రామంలో ఏ ఒక్కరికీ నష్టపరిహారం అందలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తాం

మంత్రి కొలుసు పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు: చిరు వ్యాపారులు, కుల వృత్తిదారులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నూజివీడు కోసం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం రాత్రి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఔత్సాహిక రైతులకు, నిరుద్యోగులకు ప్రోత్సాహం, ప్రభుత్వ రుణాలపై జరిగిన అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇచ్చే రుణాలను అంది పుచ్చుకోవాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రుణాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులకు, చిరు వ్యాపారులకు రుణాలను అందించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏ ఒక్క రైతుకు గాని, చిరు వ్యాపారులకు గాని, బ్యాంకర్స్ రుణాలు ఇవ్వమని చెప్పిన పక్షంలో తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే బ్యాంకర్స్‌తో మాట్లాడి రుణాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. పశుసంవర్ధక శాఖాధికారులు, బ్యాంకర్స్, రైతులు, చిరు వ్యాపారులు, నాయకులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ



మాట్లాడుతున్న నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ

ఆగిరిపల్లి: సైబర్ నేరాలు అధికమవుతున్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ అన్నారు. మన పోలీస్–మన రక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో లాటరీ వచ్చిందని, కూపన్స్ వచ్చాయని సైబర్ నేరగాళ్లు ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారని, విద్యార్థులు ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం ప్రమాదాలకు కారణాలు అని చెప్పారు. ఎస్ఐ శుభశేఖర్, ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

తిరువూరు జడ్జి సిందూర



మాట్లాడుతున్న జడ్జి సిందూర

విస్సన్నపేట: విద్యార్థులు ఇష్టంతో చదివినప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించగలరని తిరువూరు కోర్టు జడ్జి సిందూర అన్నారు. నరసాపురం గ్రామంలోని బాలికల గురుకుల పాఠశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ న్యాయవిజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలపై లైంగిక దాడులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామన్నారు. కోర్టుకు వచ్చేందుకు భయపడాల్సిన పనిలేదని చెప్పారు. పోక్సో కేసుకు సంబంధించి స్నేహపూర్వక వాతావరణంలో ఉండే విధంగా కోర్టు డిజైన్ చేశారన్నారు. ఈ కేసులను మహిళా జడ్జీలు పరిశీలిస్తారన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను వివరించారు. కార్యక్రమంలో తిరువూరు కోర్టు సీనియర్ లాయర్లు లక్ష్మీనారాయణ, జనార్దనరావు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల, ఎస్ఎంసీ చైర్మన్ సరస్వతి, గ్రామ ప్రముఖుడు జి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నూజివీడుకు స్పేస్ ఆన్ వీల్స్ బస్సు

నూజివీడు: భారతీయ విజ్ఞాన మండలి, విజ్ఞాన భారతి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన స్పేస్ ఆన్ వీల్స్ బస్సు శుక్రవారం నూజివీడుకు వస్తుందని జిల్లా సమన్వయ కర్త ఎస్. వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. విద్యార్థులకు ఇస్రో కార్యకలాపాలు, భారత అంతరిక్ష మిషన్ సమాచారాన్ని అందించేందుకు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ వాహనం పట్టణంలోని విజయవాడరోడ్డులో గల సెయింట్ థామస్ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. స్పేస్ ఆన్ వీల్స్ వాహనంలో ఇస్రో నిర్వహించిన అంతరిక్ష యాత్రల సమాచారం, వివిధ ఉపగ్రహాల నమూనాలు, చిత్రాలు, ఇస్రో భవిష్యత్ ప్రణాళికలను ఇస్రో సాంకేతిక నిపుణులు విద్యార్థులకు వివరిస్తారన్నారు. నూజివీడు పరిధిలోని ఆసక్తిగల పాఠశాలల, కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com